# పందిరి లేని తీగ

రాత్రి ఎడతెరపి లేకుండా కుండపోతగా వాన కురిసింది. ఉరుములూ మెరుపులూ భీభత్సంగావుంది. వాతావరణం గాలీ వానా గడగడలాడించాయి. రాత్రంతా నిద్రపట్టక ఒంటరిగా కూర్చున్నాడు రవి. తెల్లవారుజామున నిద్ర పోయాడు.

ఉదయం తొమ్మిదయింది. సూర్యోదయం కాలేదు సన్నగా తుంపుర్లు పడుతున్నాయి. ఈదురుగాలి తోలుతూ వుంది. నిద్రలో దుప్పటిమీద దుప్పటి కప్పుకున్నాడు. రవి కళ్లువిప్పాడు. మంచంమీంచి దిగ బుద్ధిపుట్టలేదు.

కిటికీరెక్క తీస్తుంటే జల్లు చేతిమీద పడింది. చేయి తుడుచుకుంటూ కిటికీలోంచి చూశాడు. విచిత్రమైన దృశ్యం తన కళ్లను తానే నమ్మలేకపోయాడు.

ఎవరామె?

నడుంకి తుండుగుడ్డ చుట్టుకొని పైన మరేమీ బట్టలు లేకుండా స్త్రీ! తను అద్దెకుంటున్న మెడపై భాగానికీ, లేడీస్ కాలేజి విద్యార్థినులు అద్దెకుంటున్న మేడగదులకూ, మధ్య నున్న డాబామీదవున్న బాత్‌రూంలోంచి, ఆ సమయంలో ఆమె ఆ విధంగా వెళుతూవుంటే రవి బిత్తరపోయాడు. అట వంటి దృశ్యం ఎప్పుడూ చూడలేదు.

ఆమె పసిపిల్లకాదు, పెద్దమనిషే! వృద్ధురాలు కాదు, యువతి. అందంలేంది కాదు, సౌందర్యవతి.

రవికి ఉదయమే అయోమయంగా ప్రారంభమయింది. ఆమె ప్రవర్తన వింతగావుంది.

మంచంమీాంచి లేచి టైం చూచుకొన్నాడు. తొమ్మిదిం బావు! కాలకృత్యాలు ముగించి, బట్టలువేసుకొన్నాడు. పావు తక్కువ పది!

పదిహేను నిమిషాల్లో కాలేజీకి పోవాలి. జల్లుపడుతూ వుంది. రిక్షా రాలేదు. చిరాకుపుడుతూవుంది. కాలేజీకి సెలవు ఇచ్చినా లెక్చరెర్లు సంతకం చేయవలసిందే! టైం దాటిపోతూ వుందీ. రిక్షా రాలేదు. హడావుడిగా వుంది.

చూరులోంచి ఒక్కొక్క నీటిబొట్టూ పడుతూవుంది. చెట్లుమీాదపడిన వర్షం నీరు, గాలికి నేలమీాద పడుతూవుంది. నీడలోకిపోయిన ఆమె రూపమే గుర్తుకువస్తూవుంది. బంగారు శరీర చ్ఛాయ.

రిక్షా వచ్చింది. కాలేజీకి చేరాడు. అనుకొన్నట్లే సెలవు ఇచ్చారు. స్టాఫ్‌రూంలో చంద్రంతోపాటు కూర్చున్నాడు. విద్యార్థులు ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు. లెక్చరర్లుకూడా చాలవరకు వెళ్లారు. ప్రతిరోజూ ఆ సమయం నిండుగావుండే కాలేజీ ఆ రోజు బోసికొట్టినట్టుంది.

కర్రవెంట ఎవరో యువతి వచ్చింది. ఆమెనెక్కడో చూచి నట్టు అనిపించింది. రవి తదేకలక్ష్యంగా చూశాడు. అయినా ఎక్కడ చూశాడో గుర్తుకురాలేదు. స్మృతిపథంలో ఆమె రూపనికి వ్యక్తంకాలేదు.

ఆమె అందంగా వుంది. విపరీతంగా అందంగా వుంది. సౌందర్యశిఖరంలాగా భాసించింది. మళ్లీ మళ్లీ చూడబుద్ధి పుట్టింది. పరిపూర్ణంగా కనిపించింది. శరీరం అంతటా నిండుదనం వుంది.

ఆమె ముఖంలోని సుందరతమీద ఏవో చీకటిచారలు కనిపించాయి. కళ్లచుట్టూ — కళ్లకాంతి చుట్టూ — కొలిమ కదులుతూవుంది.

ఆమె విచారంగావుంది. విచారంలోనే అందంగావుంది. సంతోషంగానే వుంటే, ఎంత దేదీప్యమానంగా వెలిగి పోతుందో! హృదయం అర్పించిన తావులో మరెంత సొగసు సోయగాల పరిమళ పుష్పం అవుతుందో!

'ఈమె ఏదో అప్లికేషన్ వ్రాసుకొంది. కొంచెం చూడాలి చంద్రం' శర్మ చెప్పాడు.

'అలాగే' చంద్రం వెళ్లాడు.

ఆమె వెళుతుంటే ఎవరో స్ఫురించింది. ఉదయం స్నానం చేసి వెళుతూ కనిపించింది ఆమె!

వాళ్లను పంపించి చంద్రం తిరిగి రాగానే రవి ప్రశ్నించాడు 'ఎవరామె?'

'తెలుగు లెక్చరరు.'

'ఎక్కడ?'

'లేడీస్ కాలేజీలో.'

'పేరు?'

'రాధామణి!'

బదిలీ అయి వారం రోజులక్రితం ఆ వూరు వచ్చిందామె. వచ్చిన నాలుగు రోజులలో డిస్మిస్ చేశారు.

తనకు అన్యాయం జరిగిందని న్యాయం కలిగించమని అప్లికేషన్ పెట్టుకుంటూ వుంది.

రవికి బాధ కలిగింది. ఆమె ఉద్యోగం ఎందుకు పోవాలో? అంత తప్పు ఏం చేసివుంటుంది? ఆలోచించిన కొద్దీ అతనికి బాధే మిగిలింది.

'ఎందుకు ఉద్యోగం పోయిందో?'

'ఏదో పెద్ద గోలే వుంది. మనకెందుకూ? పోదాం.'

రవికి సానుభూతి అధికమయింది.

'ఉద్యోగం పోతే ఎంత కష్టం' చాలాసార్లు అనుకొన్నాడు. ఆలోచనలతో మనస్సు వికలమైపోతూ వుంది.

రవి గదికి వచ్చాడు.

ఆమె వరండాలో కూర్చునివుంది. ఆ మేడగదులలో వుండే అమ్మాయిలు సాధారణంగా వరండాలోకి రారు. ఆమె కదల కుండా కూర్చుంది. అర్థంలేకుండా ఆకాశంలోకి చూస్తూవుంది. చూపులలో శూన్యత.

అతను జాలిగా ఆమె వైపు చూశాడు. ఆమె అదేమీ గమనించలేదు. నిరామయంగా కూర్చునివుంది.

వాతావరణం ఏమీ బాగాలేదు. చలిగా వుంది. వాన తగ్గిందికాని వెలుతురులేదు. ఆకాశం మేఘావృతమై వుంది. మళ్లీ వాన రావచ్చు. ఆమె మధ్యాహ్నంనుంచీ అక్కడ కూర్చుంది. ఎటూ చూడటంలేదు. ఆకాశంలోకే! అటే—

ఆకాశం అవతలి అంచుకు. అనంతత్వంలోకి. అక్కడ—ఆ ప్రక్క అంతా శూన్యం—అంతా ఖాళీ.

ఎక్కడా ఏ వెలుగుకిరణమూ లేదు. ఏ కాంతీ లేదు. ఏ ఆశాలేదు. బాధ! యాతన! దిగులు!

చీకటిపడింది అయినా ఆమె లేవలేదు. అక్కడే అలాగే కూర్చుంది. లైటు వేసుకోలేదు. చీకటిలో, చీకటి హృదయంతో, నిరాశలో, నిరాశాభారంతో, దిగులులో దిగులు కప్పుకున్న శరీరంతో స్థాణువులా, రాయిలా, చలనం లేకుండా, శూన్యంగా కూర్చునివుంది.

రాణి ఎవరు? ఇక్కడెందుకుంది? తనకెందుకీ విచారం? ఎందుకీ సానుభూతి? ఏమిటీ జాలి? రవి ఆలోచించుకోసాగాడు, అంతులేదు.

రవికి ఎన్నో ప్రశ్నలు! సమాధానంలేని, జవాబురాని, అర్థంలేని, అడగరాని చిక్కుప్రశ్నలు. తల్లిదండ్రులెవరు? భర్త ఎవరు? ఏంచేసింది? ఉద్యోగం ఎందుకు పోయింది?—ఇలాంటివి ఎన్నో!

తెల్లవారింది. రవి నిద్రలేచి చూచాడు. ఆమె వరండాలో చూపులు శూన్యంలో లక్ష్యంలేదు, కేంద్రంలేదు.

రాత్రి ముమ్మరంగా వర్షం కురిసింది, వెలిసిపోయింది.

ఉదయం ప్రశాంతంగా వుంది. సూర్యోదయమయింది. సూర్యుడు స్వచ్ఛంగా కడిగిన ముత్యంలాగా మెరుస్తున్నాడు.

రవి కాలేజీకి బయలుదేరాడు.

తడిబట్టతో తుడిచిన గదిలాగావుంది రోడ్డు. మురుగు కాలవలో మురికి అంతా కొట్టుకుపోయి, గులకరాళ్లు కనిపి

స్తున్నాయి. వాననీటిపైన తేలిపోతూ, వంతెన అడ్డుపడి, పేరుకుపోయిన ఆకులలములా కాగితాలు వింతగా వున్నాయి. గాలితాకిడికి చెట్లుమీంచి పడే నీటిబిందువుల గుండెల్లోంచి చొచ్చుకుపోయిన సూర్యకిరణాలు మెరుస్తూ వున్నాయి.

'వాన కురుస్తూవుంటేనే మంచిది' అన్నాడు రిక్షా డ్రైవర్. నిజమే! అతనికి మంచిదే కావచ్చు!

ఆమెకీ ఆపద కీడే! ఆమెకు పెళ్లయిందో లేదో? పెళ్లికాకుంటే బాగుణ్ణు అనుకొన్నాడు. బాగు ఏమిటో రవికి స్పష్టంగా తెలియదు.

కాలేజీకి రాగానే శర్మదగ్గరకు పోయాడు రవి.

'ఏం బ్రహ్మచారీ! ఏమిటి సంగతులు?'

'ఏమీ లేవు!' రవి ఎదురుగా కూర్చున్నాడు.

శర్మ తెలుగు పండితుడు. రవి ఆ కాలేజీలోనే బి.ఏ. చదువుకొన్నాడు. శర్మ రవి క్లాసుకు రెండేళ్లు తెలుగు పొయిట్రీ చెప్పాడు. రవి చదువుకొన్న కాలేజీలో లెక్చరరుగా చేరినా, తన లెక్చరర్నుపట్ల గౌరవం చూపేవాడు, వాత్సల్యం స్వీకరించేవాడు.

'నిన్న మీవెంట వచ్చింది చూడండి ఎవరామె! ఉద్యోగం ఎందుకు పోయింది' రవి అడిగాడు.

'పాపం! ఏం చెప్పేది!' చాలా దీనస్థితి! శర్మ చెప్పాడు.

రాధారాణి పుట్టేసరికి తండ్రి గతించాడు. నాలుగేళ్లకు తల్లి కాలంచేసింది. ఎవరో పుణ్యాత్ములు ఆమెను అనాథాశ్రమంలో చేర్చారు. అక్కడే పెరిగి పెద్దదయింది.

ఆమెకు వయస్సుతో పాటు చదువు పెరిగింది. జీవిత కాంక్షలు పెరిగాయి. చేతిలో చిల్లిగవ్వ లేకుండా దయామయుల ఆదరణవల్ల ఎం.ఏ. వరకు చదివింది.

ఏదో ఎం.ఏ. పుస్తకాలు కావాలని రాధారాణి రావటం వల్ల శర్మతో పరిచయమయింది. కూతుళ్లులేని శర్మ ఆమెకు చాల సహాయం చేశాడు.

ఉద్యోగంలో చేరింతర్వాత పెళ్లి చేసుకోవాలని ఆ మధ్య ప్రయత్నించింది. అది విఫలమయింది. మళ్లీ ప్రయత్నించ లేదు. ఆ ఆలోచనే మానుకొంది.

ఉద్యోగం పోవటం అనాథ అయిన ఆమెకు మాత్రమే కష్టంకాదు. అనాథాశ్రమానికి కూడా కొంచెం కష్టమే! ఎందుకంటే ఆమె జీతంలో సగం ఆశ్రమానికి ఇస్తూవుండేది!

రవికి అకారణంగా మానసిక సంక్షోభం అధికమయింది. ఆమె ఏవరో ఏమో అతనికేమీ తెలియదు; అయినా ఈ బాధకు హద్దులేకుండా పోయింది. బాధతోనే గడికివచ్చాడు.

ఆమె మళ్లీ కనిపించలేదు. ఆమె దైన్యం ఎంత మరచిపోదామన్నా మరపు రావటంలేదు వారం రోజులయ్యాక ఆ మేడ గదుల్లో పనిచేసే మనిషి వచ్చింది. ఉత్తరం తెచ్చి ఇచ్చింది. విప్పి చదివాడు.

రవిగారూ!

మీరు వేరేవిధంగా భావించకపోతే వంద రూపాయలు ఇవ్వండి. ధర్మం చేశారని మరిచిపోండి. వీలుంటే ఎప్పుడయినా ఇస్తాను

రాధారాణి.

రెండు క్షణాలు నిశ్శబ్దంగా నిలబడిపోయాడు. ఆ ఉత్తరం తీరు విచిత్రంగా ఉంది. ఏమనాల్తో తెలియదు. ఆమె అడగకుండా అత్యున్నతమయింది ఇవ్వాలనుకున్నాడు. అనుకుంటున్నాడు. అడిగింది కాదనలేదు. 'సాయంకాలం!' చెప్పాడు.

పనిమనిషి వెళ్లిపోయింది. బ్యాంకుకుపోయి మార్చుకొని వచ్చాడు. గదికి రాగానే పనిమనిషి వచ్చింది. డబ్బు ఇచ్చాడు. తీసుకొనిపోయింది.

డబ్బు తీసుకొన్న రాణి వరండాలో నిలబడి రవి గదివైపు ఒక్కసారి కృతజ్ఞతాపూర్వకంగా చూచింది. రవి కిటికీలోంచి చూశాడు. కనుకొలకుల్లో కన్నీరు కదిలింది.

వారం తర్వాత ఇంటిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. పెళ్లి చూపులకు పోయిరావలసిందని ఆదేశం!

రాధారాణికి తను ఇవ్వగలిగిన అత్యున్నత పదవి రవికి అప్పుడు స్పష్టంగా తెలిసింది.

పెళ్లిచూపులకు వెళ్లలేదు. రాణికోసం వెదికాడు. రెండో రోజు మేడమీదికి వెళ్లాడు. అక్కడ విద్యార్థినులు అంతా మర్యాదగా గౌరవంగా ప్రవర్తించారు. కుర్చీవేసి, కాఫీ ఇచ్చారు.

రాణినిగూర్చి ప్రశ్నిస్తే, ఆమె నాలుగు రోజులక్రితం వెళ్లిపోయిందని చెప్పారు. అడ్రసు తెలియదన్నారు. హతాశయుడై తిరిగి గదికి వచ్చాడు.

ఆ సంవత్సరమంతా అసంతృప్తితోనే గడచిపోయింది. రవి మొదట్లో ఆమె ఉనికి తెలుసుకోవటానికి తీవ్రప్రయత్నం

చేశాడు. ఫలితం లేకపోయింది. ఆమె క్రమక్రమంగా స్మృతి పథంలోంచి తొలగిపోయింది.

ఆ వేసవిలో రవికి పెళ్లయింది. పెళ్లి సమయంలో ఆమె గుర్తు రాకపోలేదు. అయినా బలవంతంగా హృదయంలోంచి ఆమె రూపం చెరిపివేసుకొన్నాడు. వేరే కాలేజీలో ఉద్యోగం వచ్చింది, జీతం ఎక్కువ! పనిచేస్తున్న కాలేజీకి రాజీనామా ఇచ్చాడు.

క్రొత్త వూరు. ఒంటరిగా వెళ్లాడు. పెళ్లి అయినా బ్రహ్మచారి జీవితం తప్పలేదు. ఒంటరి జీవితం అలవాటు తప్పింది. క్రొత్త వూళ్లో కబుర్లు చెప్పే రూంమేట్ అవసరం కనిపించింది.

రూం దొరకక అవస్థపడుతున్న, వేణును తన గదిలో చేరమని చెప్పాడు. ఇద్దరూ రూంమేట్‌లయ్యారు.

వేణుకు ఆ సంవత్సరమే యం.ఏ. పూర్తి అయింది. వెంటనే ఉద్యోగం వచ్చింది. కబుర్లకు విరామంలేదు; వేణు నోటినిండా మాటలే! కాలక్షేపం బాగుంది. అసత్యమైనా సత్యంలాగా చెప్పగలిగే నేర్పు వున్నవాడు వేణు.

కల్పన అతని సొంత ఆస్తి. మంచి మాటకారి. అతను వాస్తవం చెబితే అనుమానంగా ఉంటుంది కాని కల్పిస్తే మాత్రం నమ్మకం కలిగిస్తాడు. నిమిషంలో విడదీయ వీలుగాని చిక్కు కల్పనచేస్తాడు. ధారాళంగా మాట్లాడుతాడు. ఒక రోజు అకస్మాత్తుగా రాధారాణి విషయం చెప్పాడు. ఆమె వేణుకు లెక్చరరు.

ఆమె తొందరలోనే పాఠం బాగా చెబుతుందనే పేరు సంపాదించుకొంది. తెలుగులో స్త్రీ చెప్పలేని విషయాలు నిస్సంకోచంగా పూసగుచ్చినట్టు వివరించుతూ వుండేది. అల్లరి చేయాలనుకొనే కాడీలవంటి మగపిల్లలు అవమానం పాలయి సిగ్గుపడుతూ వుండేవాళ్లు. అలా ఎన్నో విషయాలు చెప్పాడు. చివరకు తేల్చి చెప్పాడు. 'ఆమెకు లేనిది సంకోచం.'

ఒక రోజు వేణు హడావుడిగా వచ్చాడు. బాధగా చెప్పాడు.

'మాష్టారూ! రాధారాణిగారు చనిపోయారండీ.'

'ఏమిటీ?'

'రాధారాణిగారు చనిపోయారు, ఉరివేసుకొని. మొన్న—హైద్రాబాద్‌లో—అన్ని ప్రయత్నాలు విఫలమై.'

రవి వినలేకపోయాడు.

మనస్సంతా సంక్షోభించింది. లోలోన కుమిలిపోయాడు.

ఆమె ఎందుకు చనిపోయింది? అంత పరిస్థితి ఏమొచ్చింది? ఏదో విధంగా జీవించలేకపోయిందా? జీవితంమీద విరక్తి పుట్టిందా? ఎన్నో ప్రశ్నలు! చుట్టూ ప్రశ్నలు!!

తల్లీ తండ్రీ లేక, ఉద్యోగం లేక, భర్త లేక, బ్రతుకు దెరువు లేక, నా అనేవాళ్లు లేక, ఈ లోకంలో జీవించలేక, సర్వం శూన్యమయి, ఎక్కడా నిలవలేక, జీవిక దుర్భరమై, దిక్కు-తోచక, నికృష్టంగా ఆమె చనిపోయింది. త్వరలో రవి మామూలు మనిషి కాలేకపోయాడు. సొంత బంధువును కోల్పోయినట్టు దుఃఖించాడు.

ఆ సంవత్సరంలో ఎప్పుడూ ఆమె ప్రసక్తి రాలేదు. ఆమె జ్ఞాపకమే మాసిపోయింది. ఆమె కాలగర్భంలో కలిసి పోవటంతో ఆమె స్ఫురణలోంచి తొలిగిపోయింది.

రెండో ఏడు రవికి మరో వూరు బదిలీ అయింది. ఆ వూళ్లో కాపురం పెట్టాడు. కొత్త కాపురం. కుటుంబానికి కావలసిన వన్నీ కొనుక్కుంటున్నాడు. బట్టలదుకాణంలో దుప్పట్లు కొంటుంటే రాజుతో పరిచయమైంది.

రాజు మొదటినుంచీ ఆ వూరు కాలేజీలోనే లెక్చరరు. మనిషిని చూడగానే గౌరవం కలిగింది. నిండు రూపం. మంచి విగ్రహం. చక్కగా హుందాతనం. కళ్లల్లో సౌందర్యం! ముఖంలో అన్వేషణ! కనుబొమ్మలలో పట్టుదల! పెదాలమీద విచారం!

పరిచయమే స్నేహంగా ప్రారంభమయింది. మొదటి రోజే తమ్ముడూ అంటూ పిలచాడు. సంభాషణలలో నేర్పూ. కలుపు గోలుతనం కనిపించాయి. రాజులో చదువుతోబాటు వచ్చే పరిణితి. జన్మతః సిద్ధమైన సంస్కారం, లోకానుభవం తర్వాత లౌక్యం వున్నాయి.

ధర్మం, వేదాంతం, నీతీ, నిజాయితీ, అంటూ రవికి అంతు పట్టని పొంతనకుదరని సంగతు లేవేవో చెబుతూ వుండేవాడు. ఒక రోజు 'నా పునర్జన్మకు పూర్వ జన్మ చెబుతాను తమ్ముడూ ఇంటికి పోదాం రా' అంటూ తీసుకుపోయాడు.

పెద్ద ఉత్తరాల కట్ట ముందు పడేశారు.

'చదువుకో!' అన్నాడు. రవి సంకోచిస్తుంటే 'ఏం ఫరవా లేదు చదువు!' అన్నాడు.

రవి ఒక్కొక్క ఉత్తరం తీసి చూశాడు. అవన్నీ రాధా రాణి వ్రాసినవే! శృంగార లేఖలు.

అకస్మాత్తుగా రవికి ఆమెతో మొదటి పరిచయం గుర్తుకు వచ్చింది. అప్పుడామె ఈ వూరునుంచే ఆ వూరు బదిలీ అయి వచ్చింది. ఉద్యోగం పోగొట్టుకుంది.

ఆసక్తిగా ఉత్తరాలు అన్నీ చదివాడు.

అప్పటికే రాజుకు పెళ్లయింది. పిల్లలున్నారు. అయినా రాణి అతన్ని ప్రేమించింది. పెళ్లికి సిద్ధమయింది.

ఏ కారణంవల్లనో పెళ్లి కాలేదు. అయినా ఇద్దరూ భార్యాభర్తలులాగా వ్యవహరించారు.

వీరిద్దరి సంబంధం కాలేజీ అంతా తెలిసిపోయింది. గొడవ బయలుదేరింది. ఉద్యోగాలు పోయే పరిస్థితీ వచ్చింది.

రాణికి బదిలీ అయింది. ఉద్యోగం పోయింది. రాజుకు బదిలీ కాలేదు. ఉద్యోగం పోలేదు. అరిటాకూ ముల్లూ సామెత అక్షరాలా నిజమేననిపించింది.

కాఫీ ఇస్తూ 'పూర్తయిందా?' అన్నాడు.

'ఊఁ!' రవి చెప్పాడు.

'ఉత్తరాలలో లేనివిషయం—అది వ్యభిచారిణి!'

రవి రాజు ముఖంలోకి చూశాడు. ముఖం కొత్తగా కనిపించింది. ఇతఃపూర్వం పరిచయంలేని వ్యక్తి ముఖంలాగా వుంది. వింత సత్యం ఏదో రాజు ముఖంలో విలయతాండవం చేసింది.

ఈ రాజు ఆ రాజు కాదనుకొన్నాడు రవి. ఆ రాజు అంటే రాధారాణి ప్రేమను స్వీకరించిన రాజు అయినా కావచ్చు. తను ఒక అభిప్రాయం ఏర్పరచుకొన్న రాజు అయినా కావచ్చు.

'నన్ను నాశనం చేసింది!'

ఎలా అని అడుగుదామనుకొన్నాడు రవి. కొంచెం కోపం గూడ వచ్చింది. అయితే మాట్లాడలేదు.

'మేలుకూడా చేసింది.'

అంతలోనే అభిప్రాయం మార్చుకొన్నాడా అనిపించింది. పై రెండు అభిప్రాయాలలో ఒకటి సత్యం కాదా? రెండూ వాస్తవమా? రెండూ అసత్యమా? ఈ పరస్పర విరుద్ధమైన భావాల్లో ఏది సత్యమో ఏదసత్యమో స్పష్టంగా తెలియదు.

వేదాంత గ్రంథంలోంచి శ్లోకం చదివి ప్రతిపదార్థం తాత్పర్యం—విశేషాలు చెబుతూ వున్నాడు. దైవం, భక్తి, మోక్షంవంటి మాటలు వినబడుతున్నాయి.

నిజం! నిజం! రాజు మళ్లీ జన్మించాడు. ఇది నిజంగా పునర్జన్మే అనుకొన్నాడు రవి.

బయలుదేరుతూ రవి చెప్పాడు.

'ఆ ఉత్తరాలు అన్నీ ప్రచురిస్తే—ఒక క్రమంలో—మంచి శృంగార సాహిత్యం అవుతుంది. దీనివల్ల లోకంతరంలో ఉన్న ఆమె ఆత్మకు శాంతి అయినా కలుగుతుంది.'

'ఏమిటీ! రాణీ చనిపోయిందా?'

రాజు కళ్లు చెమ్మగిల్లాయి.

'మీకు తెలియదా? ఉరి పోసుకొని—హైద్రాబాదులో—పాపం—చనిపోయింది.'

'నేను నమ్మను!'

'నిజం.'

'అది చనిపోదు. ప్రపంచాన్ని చంపిగాని అది చనిపోదు!

రవి వినలేకపోయాడు. లేచి బైటకి వచ్చాడు. ఇంటిముఖం పట్టాడు. సగం దూరం మౌనంగా వచ్చి, వెనుదిరిగి వెళ్ళిపోయాడు రాజు.

ఆమె ఆలోచనలే అడుగులై అరమైలు దూరం నడిచి ఇల్లు చేరాడు రవి.

తను ప్రేమించిన వ్యక్తి గుండెల్లో కూడ కొంచెం చోటయినా లేకుండా చేసుకొని వెళ్ళిపోయింది రాణి! అభాగ్యురాలు!

రవికి రాజు ఎప్పుడు కనిపించినా అతనిలో రెండు రూపాలు కలపిస్తున్నాయి. ఏ రూపమూ మరొక రూపాన్ని మరుగు పరచలేకపోతూ వుంది.

రెండేళ్లకు హైద్రాబాదు వెళ్లాడు రవి. పగలంతా ఆఫీసు చుట్టూ తిరిగి సాయంకాలం పబ్లిక్ గార్డెన్స్‌లోకి చేరాడు.

పచ్చికమీద కూర్చున్నాడు. ఎవరూ స్నేహితులు లేరు వెంట. కొత్త మనుష్యుల్ని వింతగా చూస్తున్నాడు.

ఎదురుగా పచ్చికమీద జంట! ప్రేయసీ ప్రియులో—భార్యాభర్తలో—అన్యోన్యంగా ఉన్నారు.

ఆమెనెక్కడో చూచిన గుర్తు. స్పష్టంగా తెలియటంలేదు. బహుశా ఏ వైనా సిటీ బస్సులోనేమో!

యువకుడి మీసాలు విచిత్రంగా వున్నాయి. ఆ ముఖానికి మీసాలు బాగా లేవు.

కొంచెం సేపట్లో వాళ్లు లేచి వెళ్లిపోయారు.

రెండో రోజు రవి వచ్చి యథాస్థానంలో కూర్చున్నాడు. వేరుసెనక్కాయలు కొనుక్కున్నాడు.

అంతలో ఆమె వచ్చింది. నిన్నటి ఆమె! యువకుడు లేడు. నడికారు వయస్సు. క్రొత్త వ్యక్తి. ఆ రోజు ఆమె ముఖం చూస్తే భయం కలిగింది. కాని వాళ్ల సంభాషణ వినాలని మాత్రం కుతూహలం కలక్కపోదు. మాటలు వినిపించటం లేదు కాని నవ్వులు మాత్రమే! ఆమె రవిని చూచింది. రెండు క్షణాలు కళ్లుమూయకుండా చూచింది. చూపులో ఆశ్చర్యంలేదు, సంభ్రమంలేదు, కళ్లతో చెక్కిళ్లతో నవ్వింది. అలవోకగా నవ్వింది. ఆ నవ్వు ఎదుటి మనిషికి తెలియదు.

రవి ఆమెనెక్కడో చూచాడు. ఆ చూపు పరిచయమే! ఎవరామె? ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు.

మూడో రోజుకూడ ఆఫీసు పని పూర్తి కాలేదు. కాలేజీకి లీవు ఎక్స్టెండ్ చేశాడు. ఏం పాలుపోక పబ్లిక్ గార్డెన్స్‌కు వచ్చి మామూలు చోట కూర్చున్నాడు.

ఆమెనుగూర్చి ఆలోచించాడు. ఎవరామె! ఆమె రావచ్చు. ఇవాళకూడా ఇంకో వ్యక్తితో రావచ్చు. బహుశా వేశ్య అయి ఉండవచ్చు.

ఆమె వచ్చింది. వెంట ఎవరూ లేరు. ఒంటరిగా వచ్చింది. దూరంగా కూర్చోలేదు. రవిని చూచి, దగ్గరకువచ్చి, ఎదురుగా కూర్చుంది.

'బాగున్నారా?' ప్రశ్నించింది.

క్షణం తటతటాయించి తల వూపుతూ నోరు కదిపాడు. 'వూఁ!'

'నేను గుర్తున్నానా మీకు?'

రవికి గుర్తులేదు. అలా అంటే నొచ్చుకుంటుందేమోనని సమాధానం చెప్పకుండా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

'రాధారాణిని! మీదగ్గర డబ్బు తీసుకొన్నాను' అంది.

రవి వణికిపోయాడు. ఈమె! ఈమె!! రాధారాణి!!! నమ్మకం లేదు. నమ్మకచేసేది లేదు. వళ్లంతా చెమటపట్టింది.

ముఖంలోకి చూస్తూ 'మీరింకా బ్రతికే ......'

'బ్రతికే వున్నాను. చనిపోలేదు. చనిపోవలసి కూడా చనిపోలేదు. మీ అప్పు తీర్చేదాగా చనిపోను లెండి.'

అప్పుడనిపించింది, వేణు చెప్పింది నిజంకాదు, అబద్ధం. వట్టి కల్పన! ఛాయామాత్రంగానైనా సత్యంలేని కల్పన!

'మీరిప్పుడేం చేస్తున్నారు?'

'లెక్చరరు! ఇక్కడే!'

ఏదో అడగాలనుకొన్నాడు. అడగలేకపోతున్నాడు. వేరే విధంగా చివరకి అడిగేశాడు.

'మీకు పెళ్లయిందా?'

'లేదు!' వెంటనే సమాధానం చెప్పింది. 'ప్రయత్నిస్తున్నాను' నిశ్శబ్దంగా ఆగింది. 'త్వరలోనే' ముగించింది.

'ఒంటరిగా వచ్చారు' నసుగుతూ ప్రశ్నించినట్టే అడిగాడు.

ఆ ప్రశ్నకు సమాధానం ఎప్పుడో సిద్ధం చేసుకొన్నట్టుగా 'మీ కోసం' అంది.

రవికి గుండె ఆగినంత పనయింది. భయంతో బెదిరిపోయాడు. నోటివెంట మాటలేదు.

రాణి లేచి నిలబడింది. 'రండి వెళదాం!'

'ఎక్కడికి?' ప్రశ్నించాడు.

'మా యింటికి.'

'ఎందుకు?'

'మీ అప్పు ఇచ్చివేస్తాను!'

'వద్దు! అక్కరలేదు. నాకు వద్దు! వద్దు. వస్తాను' రవి లేచి చరాచరా వెళ్లిపోయాడు.

ఆమె అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది.

హైద్రాబాదులో పని పూర్తయి, తిరిగివచ్చిం తర్వాతకూడ ఆమె ఆలోచనలు నీడలా వెన్నంటివుంటూనే వున్నాయి.

రాణి చెడిపోయింది. పూర్తిగా చెడిపోయింది. అపాత్ర సానుభూతీ జాలీ క్రమంగా దూరమవుతున్నాయి.

రాణిని తలంచుకుంటే ఆ మధ్య కోపంకూడ వస్తూవుంది ఆమె వింత మనిషి! అర్థంకాదు. ఆమె తత్వంలో లోపంవుంది కారణం ఆమె! ఆమె ప్రవర్తన కాకపోతే సమాజం! లేదంటే కొందరు వ్యక్తులు. ఆమె పతనమయిపోయింది. అధఃపాతాళానికి జారిపోయింది. వన్ వే ట్రాఫిక్. ఆ తోవ నామె అట పోవలసిందే కాని వెనక్కు రావటానికి వీలులేదు. ఆమె నెవరూ ఉద్ధరించలేరు. ఆమె కోరికోరి జీవితానికి దూరంగ పారిపోతూవుంది.

సంసార తాపత్రయం, ఉద్యోగం ఈ తొందర్లో ఆమెన పూర్తిగా మర్చిపోయాడు రవి.

వేసవి సెలవుల్లో భార్య కోర్కె కారణంగా, కుటుంబంతో మద్రాసు వెళ్లాడు రవి. వారం రోజులుండి తిరిగి వస్తుంటే

రైలులో ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో రాధారాణి కనిపించింది. ప్రక్కనే యువకుడు!

పరిచయం చేసినప్పుడు తెలిసింది. అతనామె భర్త! మధు!

హైద్రాబాదులో, తను పనిచేస్తున్న కాలేజీలో ఫైనల్ బి.ఏ. చదువుతున్న కుర్రాణ్ణి ప్రేమించి పెళ్లిచేసుకుంది రాధారాణి.

మధు ఆమెకంటె చిన్నవాడు. చాలా చిన్నవాడు. ప్రేమకు వయస్సుతో సంబంధంలేదేమో! లేకపోతే జీవితంతో రాజీపడితే తారతమ్యాలు అక్కరలేదేమో!

బి.ఏ పూర్తయింతర్వాత మధు మద్రాసులో ఉద్యోగం సంపాదించుకొన్నాడు. ఆపైన ఆమెకు ఉద్యోగం మాన్పించాడు.

మధుకి ఆమె పాతికవేలు కట్నం ఇచ్చింది. పాతికవేలు! బాగా సంపాదించింది. పాతికవేలు! ఆమె స్వశక్తితో పాతికవేలు సంపాదించింది. అదృష్టంవతురాలు!!

ఆ రోజు ప్రయాణం హైద్రాబాద్, భర్తచేత సెలవు పెట్టించి అత్తవారింటికి పోతూవుంది రాణి.

ఆమె జీవితంలో ఎదురుదెబ్బలు తింది. నిధులు కనుగొంది. అదృష్టం వచ్చినపుడు పొంగిపోలేదు. దురదృష్టం ఎదురైతే కృంగిపోలేదు. ఆశలోను, నిరాశలోను, మౌనం. గుండెలుండే మౌనం! మౌనమే ఆమె జీవితంలో సాధించిన సత్యం! ఆమె శీలవతి కాకపోవచ్చు! గుణవతి కాకపోవచ్చు. ఏదిఏమయినా ఆమె మనిషి! జీవితంలో ప్రతిక్షణం జీవిస్తూవుంది.

ఒక రోజులో సామాన్యులు పదిగంటలే జీవిస్తారు. ఆమె ఇరవైనాలుగు గంటలు జీవించేవుంటుంది. కొందరు గంటలో పాతిక నిమిషాలే అనుభవిస్తారు, ఆమె కొన్ని యుగాలు అనుభవిస్తుంది. ముప్పయి అయిదు సంవత్సరాల రాధారాణి వంద ఏళ్ల స్త్రీకంటే వృద్ధురాలు! అదే సమయంలో పదిహేను ఏళ్ల యువతికంటె యువతి.

ఎప్పుడో జరగవలసిన పెళ్లి ఇప్పుడయింది. ఎప్పుడో ఈ విధంగా ప్రారంభం కావలసిన జీవితం కొద్ది నెలలక్రితమే మొదలయింది. ఏది ఏమయినా ఆమె జీవితం సుఖంగా సాగిపోవాలి. దాంపత్యజీవితం ఆనందమయం కావాలని కోరుకొన్నాడు రవి.

ఆరు నెలల తర్వాత రాణి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది ఆశ్చర్యంతో చదివి స్తంభించిపోయాడు.

మద్రాసునుంచి వచ్చిన వారంలోనే మధు ఆమెపై అనుమానంతో ఒక యువకుణ్ణి హత్యచేశాడు. పోలీసులకి పట్టుబడ్డాడు. జైల్లో వుంచారు. నేరం తప్పించటానికి తనకి చేతనైన ప్రయత్నం చేసింది. డబ్బంతా వ్యయం చేసింది ప్రయోజనం లేకపోయింది. మధుకు యావజ్జీవ శిక్ష పడవచ్చు సహాయంచేయమని ప్రార్థించింది. ఉత్తరంలో రాణి రవిని.

అతనేం చేయగలడూ? ఎవరైనా ఏం చేయగలరూ న్యాయం ఎదుట మధు నేరస్థుడు. అతన్ని రక్షించటాని ఎవరికీ శక్తిలేదు.

రాణికి డబ్బు అవసరం కావచ్చు. పంపాలని అభిప్రాయం కూడా వుంది. అయితే సమయానికి డబ్బులేదు. పంపలే

...డు. వాక్సానుభూతి నిరుపయోగమని ప్రత్యుత్తరం
వ్రాయలేదు రవి.

ఆపైన ఆర్నెల్లదాగా రాణినిగూర్చి ఏమీ తెలియదు.

రెండు రోజుల్నుంచి ముసురుపట్టింది. కుండపోతగా వాన
కురిసింది. దానికి తోడు గాలి. గాలీ వాన ఎడ తెరిపి లేకుండా
వచ్చాయి. చెట్లూ చేమలూ పడిపోతున్నాయి.

ఆ రోజు పగలు వర్షంలేదు, గాలీలేదు. సూర్యోదయం
కాలేదు. ఆకాశం మేఘావృతమైవుంది. ముసురుపట్టింది.
ఏ క్షణాన అయినా వర్షం కురవవచ్చు, సన్నగా ఈదురుగాలి.

రవి కాలేజీకి పోయాడు.

సాయంకాలం ఇంటికి వచ్చేసరికి మళ్లీ వాన మొదలయింది.
ముమ్మరంగా వర్షం కురిసింది. కిటికీలు వేసుకొన్నా సందుల్లోంచి
తోలేగాలి చలి పుడుతూవుంది.

బైట గాలిహోరు ఎక్కువయింది. వర్షం అధికమయింది.

పడుకోబోయే ముందు భార్య చెప్పింది. 'మీకోసం
రాధారాణి వచ్చింది. మీతో మాట్లాడాలని అంది.
ఏలుంటే రేపు వస్తుందట.'

ఆమె ఎందుకు వచ్చిందో! ఏమవసరమయిందో! డబ్బు
వుంది! అడిగితే ఇవ్వవచ్చు. ఆలోచించాడు.

ఆమె వచ్చింది. ఈ వూరు వచ్చింది. తనకోసమే
వచ్చింది. ఆమెకు కనుపించలేకపోయాడు. అందుకు బాధ
కలుగుతూవుంది.

ఆమె ఎక్కడ దిగిందో, హోటల్లో కావచ్చు. వెళ్లాలను
కొన్నాడు. భార్య వాదించింది. కాదనలేకపోయాడు.

రాణిని చూడకుండా వుండలేకపోతున్నా
యంలో ఆవేదన చెలరేగింది. ఆమెను చూడా
త్వరలో చూడాలి. తొందరపడుతున్నాడు.

గాలి హోరు! వర్షం మోత! ఎక్కడో చెట్టు విరిగిపడింది
మరుక్షణంలో కరెంటు పోయింది. ఇల్లంతా చీకటి! హృద
యంలో చీకటి! చీకటి ఆలోచనలు! భీతావహంగా వాత
వరణం!

వాన ఎడతెరిపిలేకుండా కురుస్తూవుంది. దగ్గరలోవున్న
పూరిపాకలు పడిపోయిన చప్పుడు; గాలీ—వాన—కల్లోలంగ
వుంది.

భయంగా నిద్రపోయాడు. పీడ కలలు కలత నిద్ర
మెలుకవవస్తే దిగులు—తెల్లవారింది. రాత్రంతా భయంకర
వాతావరణం!

వర్షం తగ్గింది. గాలి తగ్గింది. రవి తొమ్మిదికే బట్టవేసుకొని
బైటకి బయలుదేరాడు. వాకిట్లో పోస్టుమాన్ ఎదురయ్యాడు

మనీ ఆర్డర్! వంద రూపాయలు! రాధారాణి పంపించింది
తీసుకున్నాడు.

‹దీంతో మీకూ నాకూ ఋణం తీరిపోయింది› చదివి అదిరి
పోయాడు. రిజిష్టర్డు కవరు! వణుకుతున్న చేతులతో తీస
కున్నాడు. రాధారాణి వ్రాసింది. చింపి చదివాడు.

రవిగారూ!

నేనెవరినీ ప్రేమించలేదు. నన్ను చాలా మంది ప్రేమి
చారు. పెళ్లిచేసుకొనేవాళ్లకోసం—నన్ను పెళ్లాడేవాళ్లకోస
—వెతకటంకోసం నేను చాలా మందితో స్నేహం చేశాన

మధు నన్ను పెళ్ళాడాడు. నేను మధుని ప్రేమించలేదు. భర్త కావలసి, అతన్ని దక్కించుకో జూశాను. దక్కలేదు.

నా సర్వస్వం కోల్పోయాను. నేనెవరికీ ఏ విధంగానూ ఋణపడలేను. ఈ జీవితంలో నే నొక్కరినే ప్రేమించాను.

నా హృదయస్థ ప్రేమను కోల్పోలేదు. నే నెవర్ని ప్రేమించానో మీకే—మీకే బాగా తెలుసు.

'రాధారాణి.'

అడ్రసు చూచి లాడ్జీకి బయలుదేరాడు రవి. రోడ్డుమీద జనం గుమిగూడి వున్నారు. రోడ్డు ప్రక్క చెట్టు విరిగిపడింది. రాత్రి చెట్టుక్రింద, రవికి అభిముఖంగా, స్త్రీ పడి చనిపోయింది. ఆమె—రాధారాణి.

* * * * *